క్లుప్తంగా

బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి



దేశ్‌ముఖ్ నగర్‌లో అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

ఇచ్చోడ: బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని ఉపాధ్యాయుడు రవికాంత్ రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని దేశ్‌ముఖ్‌నగర్, దుబార్‌పేట్ కాలనీల్లో శనివారం తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఎలాంటి ప్రవేశ పరీక్ష లేకుండా జిల్లా కేంద్రంలోని అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌లో ప్రవేశాలు కల్పించనున్నట్లు తెలిపారు. అనాథ, డ్రాపౌట్, బీపీఎల్ కుటుంబాల పిల్లల్ని చేర్పించవచ్చన్నారు. వివరాలకు 8500023457, 9705108585 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఘనంగా ఆలయ ప్రథమ వార్షికోత్సవం



పూజలు చేస్తున్న భక్తులు

జైనథ్: మండలంలోని గూడ గ్రామంలోని శ్రీ వేంకటేశ్వర ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ లక్ష్మీ పద్మావతి అమ్మవార్ల సమేతుడైన వేంకటేశ్వర స్వామికి నూతన వస్త్రాలు అలంకరించి, అభిషేకాలు చేశారు. అనంతరం భాజభజంత్రీలు, వేద మంత్రాల మధ్య కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. గ్రామస్తులే కాక చుట్టుపక్కల ప్రాంతాల భక్తులు తరలివచ్చారు.

'కంది' అనుచిత వ్యాఖ్యలు సరికాదు



మాట్లాడుతున్న మల్లేశ్

ఎదులాపురం: కాంగ్రెస్ ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి కుల దురహంకారంతో వ్యవహరిస్తున్నారని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులతో కలిసి మాట్లాడారు. బీసీ నేతలపై కంది శ్రీనివాసరెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని అన్నారు. బీసీ వర్గానికి చెందిన ఎమ్మెల్యే పాయల్ శంకర్, మాజీ మంత్రి జోగు రామన్న, ఏఐసీసీ మాజీ సభ్యురాలు సుజాత, డీసీసీ మాజీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్‌పై ఇష్టారీతిన వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. తీరు మార్చుకోవాలని హితవు పలికారు.

చెరువు తూముకు మరమ్మతు చేపట్టాలి



ఇరిగేషన్ చీఫ్ ఇంజినీర్‌కు వినతిపత్రం ఇస్తున్న కజ్జర్ల రైతులు

తలమడుగు: మండలంలోని కజ్జర్ల గ్రామంలోని పెద్ద చెరువు తూముకు మరమ్మతు చేపట్టాలని రైతులు కోరారు. శనివారం ఆదిలాబాద్‌లోని నీటిపారుదల శాఖ కార్యాలయంలో ఇరిగేషన్ చీఫ్ ఇంజినీర్ శ్రీనివాస్‌కు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెరువు తూము పూర్తిగా ధ్వంసమైందన్నారు. దీంతో వర్షాకాలంలో ఆయకట్టు రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఉందన్నారు. త్వరగా చెరువు తూము మరమ్మతు చేపట్టాలని కోరారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. గ్రామ పెద్దలు దేవారెడ్డి, కిరణ్‌కుమార్ ఉన్నారు.

'దాడి చేసిన వారిని శిక్షించాలి'

బోథ్: జైనూర్ మండల కేంద్రంలో ఆదివాసీ మర్సుకోల లక్ష్మణ్‌పై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని బోథ్ డివిజన్ తుడుందెబ్బ నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం వారు మాట్లాడుతూ దాడి చేసిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు. నాయకులు దుర్వ విశ్వేశ్వర్, అమృత్ రావ్, పంద్రం శంకర్, పంద్రం సోనేరావ్, శ్రీనివాస్, కైలాస్, అమృత్‌రావ్, సిడాం రామారావ్, ఆత్రం భీంరావ్, మడావి నాగోరావ్, సుంగన్న, కేశవ్, సిడాం గంగాధర్ పాల్గొన్నారు.

అసెంబ్లీలో 69.76.. 'పార్లమెంట్'లో 66.77

- ఆదిలాబాద్‌లో నమోదైన పోలింగ్ శాతం
- ఓటర్లు పెరిగినా.. పోలింగ్ శాతం పెరుగలే
- గత ఎన్నికల కంటే 2.99 శాతం తక్కువగా నమోదు

కైలాస్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల్లో ఆదిలాబాద్ పట్టణవాసులు ఓటు హక్కు వినియోగంపై అంతగా ఆసక్తి చూపలేదు. ఫలితంగా గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల కంటే ఈసారి పోలింగ్ శాతం తక్కువగా నమోదైంది. గతం కంటే ఈసారి ఓటర్ల సంఖ్య పెరిగినప్పటికి పోలింగ్‌శాతం మాత్రం పెరుగలేదు. పోలింగ్ సమయం పెంచడంతోపాటు ఓటు హక్కు వినియోగంపై అధికార యంత్రాంగం విస్తృతంగా ప్రచారం కల్పించిన పట్టణ ఓటర్లు పోలింగ్ కేంద్రాల వైపు కదలలేదు. ఫలితంగా అసెంబ్లీ ఎన్నికల కంటే ఈ ఎన్నికల్లో 2.99 శాతం పోలింగ్ తక్కువగా నమోదైంది.

66.77 శాతం పోలింగ్ నమోదు

గతేడాది నవంబర్ 30న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పట్టణంలో 69.76 పోలింగ్ శాతం నమోదైంది. ఆ ఎన్నికల్లో మొత్తం 99,674 మంది ఓటర్లుండగా 69,534 మంది తమ ఓటును వినియోగించుకున్నారు. దీంతో 66.79 శాతం పోలింగ్ నమోదైంది. మరో 30,140 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోలేదు. అయితే ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో 1,36,898 మంది ఓటర్లకుగాను 91,410 మంది మాత్రమే ఓటును వినియోగించుకున్నారు. ఫలితంగా పట్టణంలో 66.77 పోలింగ్ శాతంగా నమోదైంది. ఈ ఎన్నికల్లో 45,488 మంది ఓటర్లు తమ ఓటు హక్కుకు దూరంగా ఉన్నారు. గత అసెంబ్లీ ఎన్నికలతో పోల్చితే 2.99 శాతం పోలింగ్ తక్కువగా నమోదైంది.



పట్టణంలోని ఓ పోలింగ్ కేంద్రంలో మహిళ ఓటర్లు (ఫైల్)

ఓటర్లు పెరిగినా పోలింగ్ పెరుగలే..

అసెంబ్లీ ఎన్నికల కంటే పార్లమెంట్ ఎన్నికల్లో పట్టణ ఓటర్లసంఖ్య పెరిగింది. ఓటరు నమోదుపై జిల్లా యంత్రాంగం విస్తృత అవగాహన కల్పించడంతో పాటు ఓటు నమోదు గడువును పదేపదే పెంచడంతో అర్హులైనవారు ఓటర్లుగా తమ పేర్లు నమోదు చేసుకున్నారు. అసెంబ్లీ ఎన్నికలు జరిగిన గత ఐదు నెలల వ్యవధిలో పట్టణపరిధిలో 37,224 మంది ఓటర్లు కొత్తగా నమోదయ్యారు. వీరితో కలుపుకుని ఓటర్ల సంఖ్య 1,36,898కి చేరింది. ఈ సంఖ్య పెరుగడంతో వారి సౌకర్యార్థం అధికారులు పోలింగ్ కేంద్రాల సంఖ్య పెంచారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో పట్టణ పరిధిలో 105 పోలింగ్ కేంద్రాలుండగా పార్లమెంట్ ఎన్నికల నాటికి 139 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ లెక్కన గత ఎన్నికల కంటే ఈ ఎన్నికలకు 34 కేంద్రాలు అదనంగా ఏర్పాటు. దీంతో ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరుతూ స్వీప్ ఆధ్వర్యంలో విస్తత ప్రచారం కల్పించారు. ర్యాలీలు, అవగాహన సదస్సులతోపాటు రంగోళి వంటి కార్యక్రమాలు నిర్వహించారు. పైగా పోలింగ్ సమయాన్ని గత ఎన్నికల కంటే గంటపాటు అదనంగా పెంచారు. అయినప్పటికి వేలాది ఓటర్లు ఆ ప్రచారాన్ని ఓటర్లు పట్టించుకోలేదు. ఫలితంగా పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటు హక్కును వినియోగించుకోలేదు. అసెంబ్లీ ఎన్నికలపై ఆసక్తి చూపిన ఓటర్లు కూడా పార్లమెంట్ ఎన్నికలపై అంతగా ఆసక్తి చూపలేదు. దీంతో పోలింగ్ శాతం తక్కువగా నమోదు కావడం గమనార్హం. విద్యావంతులని చెప్పుకునే పట్టణ ఓటర్లు పోలింగ్‌కు దూరంగా ఉండటం విస్మయానికి గురిచేస్తోంది.



సిబ్బంది లేక దర్శనమిస్తున్న ఖాళీ కుర్చీలు



తలుపులు తెరుచుకొని ఎంపీడీవో చాంబర్ గది

సమయపాలన ఏది?

నార్నూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో సిబ్బంది, అధికారులు సమయపాలన పాటించడం లేదు. దీంతో వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. శనివారం ఎంపీడీవో కార్యాలయానికి ఇద్దరు అటెండర్లు తప్ప సిబ్బంది, అధికారులు విధులకు హాజరుకాలేదు. కంప్యూటర్ ఆపరేటర్ల నుంచి ఎంపీడీవో వరకు సమయపాలన పాటించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సిబ్బంది సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గుంత పూడ్చివేయరూ..

బోథ్: మండల కేంద్రంలోని 5వ వార్డులో ఇటీవల మిషన్ భగీరథ పైప్‌లైన్ లీక్ కావడంతో గుంతను తవ్వి పైప్‌ను సరిచేశారు. ఆ గుంతను సిబ్బంది పూడ్చివేయడం మరిచారు. గుంతను ఆనుకుని ఓ స్తంభం వద్ద ఇటీవల కురిసిన వర్షం నీరు చేరింది. దీంతో స్తంభం పడిపోతుందేమోనని కాలనీవాసులు భయాందోళన చెందుతున్నారు. స్తంభం పడిపోయే ప్రమాదం ఉన్నందున ఆ గుంతను పూడ్చివేయాలని వారు కోరుతున్నారు.



సుర్దాపూర్‌కు దారేది ?

- గ్రామానికి వెళ్లడానికి చేను తోవనే దిక్కు
- వర్షాకాలంలో అవస్థలు
- ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు

బోథ్: మండలంలోని పట్నాపూర్ పంచాయతీ పరిధిలో గల ఆదివాసీ పల్లె సుర్దాపూర్‌కు ఇప్పటికి రోడ్డు సౌకర్యం లేదు. ఈ గ్రామం ఏర్పడి 45 ఏళ్లవుతోంది. మొత్తం 11 కుటుంబాలు, 70 మంది నివాసముంటున్నారు. ఏళ్లుగా దారి లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో అవస్థలు ఎదుర్కొంటున్నారు. అయినా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో గ్రామస్తులకు చేనుకు వెళ్లేదారే దిక్కవుతోంది. ఈ దారిలో నడుస్తూ గ్రామానికి చేరుకుంటున్నారు. కనీసం ఆటోలు వెళ్లలేని పరిస్థితి ఉంది. అత్యవసర పరిస్థితుల్లో ఎడ్లబండి ద్వారా ఆస్పత్రులకు తీసుకెళ్లాల్సి వస్తుందని పలువురు పేర్కొంటున్నారు. మర్లపెల్లి–బోథ్‌కు వెళ్లే ప్రధాన రోడ్డుకు చేరుకునేందుకు కి.మీ మేర చేను గట్ల వెంబడి నడుస్తున్నారు. ప్రతిరోజూ బోథ్ వెళ్లే విద్యార్థులు, రైతులు, ఇతరత్రా పనుల కోసం వెళ్లేవారు తిప్పలు పడుతున్నారు. వర్షాకాలంలో వారి బాధలు వర్ణణాతీతం. ఇక రేషన్ షాపులకు వెళ్లి సరుకులు తేవాలంటే బురదలోనే వెళ్లాల్సి వస్తోంది. ఈ విషయాన్ని కలెక్టర్, ఐటీడీఏ పీవోలకు విన్నవించి రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు. ఇప్పటికైనా వెంటనే పట్టించుకోవాలని వేడుకుంటున్నారు.



సుర్దాపూర్ గ్రామం

ఇబ్బందిగా ఉంది



మా గ్రామానికి రోడ్డు లేక చేను గట్టు వెంబడి నడుస్తూ వెళ్తున్నాం. రేషన్ సరుకులు, సామగ్రిని తీసుకురావడానికి ఇబ్బందిగా ఉంది. గ్రామానికి రోడ్డు నిర్మించాలని కలెక్టర్, ఐటీడీఏ పీఓలకు విన్నవించాం. ఇప్పటికి స్పందన లేదు.

– ఆడెం ప్రకాశ్, గ్రామస్తుడు, పట్నాపూర్

రోడ్డు నిర్మించాలి



గ్రామానికి రోడ్డు లేదు. వర్షాకాలంలో నడవలేకపోతున్నాం. నిత్యావసర సరుకులు, పండించిన పంటను ఇంటికి తీసుకురాలేం. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకుని రోడ్డు నిర్మించేలా చర్యలు చేపట్టాలి.

– ఆడెం శ్రీనివాస్, గ్రామస్తుడు

బీటీ రోడ్డు పనులేవి?



మామిడిగూడ(జి) రోడ్డు ఇదీ

- వాగు వద్ద కల్వర్టు నిర్మాణమెప్పుడో?
- నిధులు మంజూరైనా..ప్రారంభం కాని వైనం
- వర్షాకాలంలో అవస్థలు
- ఇబ్బందుల్లో ఆదివాసీలు

ఇంద్రవెల్లి: మండలంలోని హర్కపూర్ అంద్‌గూడ పంచాయతీ పరిధిలోని మామిడిగూడ(జి) గ్రామానికి బీటీ రోడ్డు, వాగు వద్ద కల్వర్టు నిర్మాణాలకు నిధులు మంజూరైనా పనులు ప్రారంభం కాలేదు. మామిడిగూడ(ఏ)–మామిడిగూడ(జి) వరకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం గిరిజన సంక్షేమ శాఖ నుంచి రూ.2.25 కోట్లతో బీటీ రోడ్డు, కల్వర్టు నిర్మాణానికి రూ.3.50 కోట్ల నిధులు మంజూరు చేసింది. టెండర్ పనులు పూర్తవడంతో గత మార్చి 16న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు భూమి పూజ చేశారు. రెండు నెలలు కావస్తున్న కాంట్రాక్టర్ పనులు ప్రారంభించలేదు.

వర్షాకాలం వస్తే అంతే..

మామిడిగూడ(జి) గ్రామంలో సుమారు 35 ఆదివాసీ గిరిజన కుటుంబాలు, 250కు పైగా జనాభా నివాసం ఉంటున్నారు. గ్రామానికి రోడ్డు సౌకర్యం, వాగు వద్ద కల్వర్టు లేదు. గత 40 ఏళ్లుగా వర్షాకాలం వస్తే చాలు గ్రామస్తుల రాకపోకలు స్తంభించి తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఏటా వర్షాకాలం ప్రారంభానికి ముందే కుటుంబాలు రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు, వ్యవసాయానికి సంబంధించి ఎరువులు, విత్తనాలు తీసుకువచ్చి ఇళ్లల్లో పెట్టుకుంటారు. రోగులు, గర్భిణులు ముందుగానే తమ బంధువుల ఇళ్లకు తరలించి జాగ్రతలు తీసుకుంటున్నారు. తమ గ్రామానికి రోడ్డు, వాగు వద్ద కల్వర్టు నిర్మించాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు.



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు (ఫైల్)

పనులు ప్రారంభించాలి



బీటీ రోడ్డు సౌకర్యం, వాగు వద్ద కల్వర్టు లేక 40 ఏళ్లుగా రాకపోకలకు అవస్థలు పడుతున్నాం. నిధులు మంజూరైనా ఇప్పటికి పనులు మొదలు కాలేదు. అధికారులు వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు చేపట్టాలి.

– ఉయిక మహదు, గ్రామస్తుడు, మామిడిగూడ

త్వరలో పనులు ప్రారంభిస్తాం

మామిడిగూడ(జి) రోడ్డు, వాగు వద్ద కల్వర్టు పనుల్లో జాప్యం జరుగుతున్న విషయం వాస్తవమే. కాంట్రాక్టర్‌కు గతంలో చేసిన పనులకు పెండింగ్ బిల్లులు రాకపోవడమే ఇందుకు కారణం. వర్షాలు తగ్గాక త్వరలో పనులు ప్రారంభించేలా చర్యలు చేపడుతాం.

– సతీశ్, ఐటీడీఏ జేఈ

రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మహేందర్



నార్నూర్: తెలంగాణ మాదిగ దండోరా (టీఎంహెచ్‌డీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మండల కేంద్రానికి చెందిన కొరెల్లా మహేందర్ నియమితులయ్యారు. శనివారం ఆయనకు రాష్ట్ర అధ్యక్షుడు కోరివెల్లి శ్రీనివాస్ నియమకపత్రాన్ని అందజేశారు.

కన్యకాపరమేశ్వరి జన్మదిన వేడుకలు



పూజలు నిర్వహిస్తున్న మహిళలు

ఇచ్చోడ: మండల కేంద్రంలో ఇచ్చోడ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవి కన్యకాపరమేశ్వరి జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. కన్యక పరమేశ్వరి ప్రతిమకు మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. ప్రతిఏటా వైశాఖమాస శుక్లపక్ష దశమి రోజు శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి మాత జన్మదిన వేడుకలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని సంఘం సభ్యులు తెలిపారు. సంఘం నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

బాధితులకు పరిహారం అందేలా చూస్తాం



పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

గుడిహత్నూర్: ప్రభుత్వం ద్వారా బాధితులకు పరిహారం అందేలా చూస్తామని ఏఎంసీ మాజీ చైర్మన్, కాంగ్రెస్ నాయకురాలు ఆడే శీలా అన్నారు. మండల కేంద్రంలోని హనుమాన్‌నగర్‌లో గాలివానతో ఇంటి పై కప్పులు లేచిపోయి ఇంటి సామగ్రి చిందరవందరంగా పడ్డాయి. ఆ కాలనీలో శనివారం వారిని పరామర్శించారు. మాజీ జెడ్పీటీసీ మాధవ్ మస్కే, అడ్వకేట్ అజయ్, నాయకులు తరుణ్ గిత్తే, అవినాష్, భీవాజీ ఉన్నారు.

'రెడ్డి కులాన్ని కించపరిస్తే సహించేదిలేదు'

ఆదిలాబాద్‌టౌన్: రెడ్డి కులాన్ని కించపర్చేలా వ్యవహరిస్తే సహించేదిలేదని, పోలీసులకు ఫిర్యాదు చేస్తామని రెడ్డి ఐక్యవేదిక యువజన విభాగం ప్రధాన కార్యదర్శి క్యాతం శివప్రసాద్ రెడ్డి ప్రకటనలో తెలిపారు. కొందరు సోషల్ మీడియాలో రెడ్డిలను కించపర్చేలా వ్యవహరిస్తున్నారని అది సమంజసం కాదని పేర్కొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా

- ఎమ్మెల్యే అనిల్ జాదవ్

తలమడుగు: మండలంలోని బరంపూర్‌లోని కొండపై ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి కృషిచేస్తానని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శనివారం వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేని శాలువా కప్పి సన్మానించారు. గ్రామానికి చెందిన మాధురి మల్లేశ్ కుమార్తె మల్లేశ్వరి ఇంటర్ ప్రథమ సంవత్సరంలో కాలేజీ టాపర్‌గా నిలిచింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆమెకు శాలువా కప్పి అభినందించారు. గ్రామస్తులు కేదారేశ్వర్‌రెడ్డి, రామాకాంత్, రంజిత్‌రెడ్డి, రజనీకాంత్ తదితరులు ఉన్నారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

జైనూర్ పల్లెను సందర్శించిన అధికారులు

సాక్షి స్పందన

బోథ్: జైనూర్ పల్లె గ్రామంలో అనేక సమస్యలు ఉన్నాయని, అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఈ తీరు వివరిస్తూ 'అభివృద్ధికి ఆమడదూరం' శీర్షికన సాక్షిలో శనివారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మండలంలోని జైనూర్‌పల్లె గ్రామాన్ని ఎంపీవో మహేందర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కళ్యాణ్ చక్రవర్తి, భగీరథ గ్రిడ్ ఏఈ సునీల్ సందర్శించారు. మిషన్ భగరథ నీటి సరఫరాను పరిశీలించారు. ట్యాంక్ నుంచి నీటిని వదిలారు. ఇంటింటికీ వెళ్లి నల్లాలో నీటి సరఫరాను పరిశీలించారు. గ్రామంలో ప్రభుత్వ బోరు నుంచి ఇంటింటికీ నీరందుతుందని వారు అన్నారు. భగరథ నీరందిస్తామన్నారు. గ్రామంలో నీటి ఎద్దడి లేదన్నారు.



నల్లాను పరిశీలిస్తున్న అధికారులు

చెట్టు తొలగించారు..

సాక్షి స్పందన

బోథ్: మండల కేంద్రానికి వచ్చే ప్రధాన రహదారిపై ఈదురు గాలులకు చెట్టు పడిపోయింది. రెండురోజులు గడిచినా రోడ్డుపై పడిన చెట్టును తొలగించడం లేదు. శనివారం 'విరిగిపడ్డ చెట్టు తొలగించరూ' శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీనికి అధికారులు స్పందించారు. రోడ్డుపై పడిన చెట్టును తొలగించారు.



చెట్టును తొలగించిన అధికారులు

మూగవేదన

నేరడిగొండ: ఎండల తీవ్రత కారణంగా మూగజీవాలు అల్లాడుతున్నాయి. దాహం తీర్చేందుకు వాగుల్లో నీరు లేకపోవడంతో మండలంలోని పీచర గ్రామంలోని ఓ చేతిపంపు వద్ద యువకుడు వాటి దాహం తీర్చాడు. చేతిపంపును కొడుతుండడంతో ఆ పశువులు తమ దాహార్తి తీర్చుకుంటూ నీరు తాగుతున్న దృశ్యాన్ని శనివారం సాక్షి క్లిక్‌మనిపించింది.



జనరల్ నాలెడ్జ్ పుస్తకాలు పంపిణీ

ఆదిలాబాద్‌రూరల్: పట్టణంలోని ఎస్సీ స్టడీ సర్కిల్‌లో అభ్యర్థులకు డాక్టర్ బీఎస్‌రావ్ హెల్త్ ఫౌండేషన్ చైర్మన్ బీఎస్ రావు శనివారం జనరల్ నాలెడ్జ్ పుస్తకాలు పంపిణీ చేశారు. సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్న పేద అభ్యర్థులకు ఈ పుస్తకాలు అందించినట్లు తెలిపారు. స్టడీ సర్కిల్ డైరెక్టర్ రమేశ్, రిటైర్డ్ అధ్యాపకుడు విజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

యువత లక్ష్యంతో ముందుకు సాగాలి

గుడిహత్నూర్: యువత లక్ష్యాన్ని నిర్దేశించుకొని ముందుకు సాగాలని ఎస్సై ఇమ్రాన్ అన్నారు. మండలంలోని మాన్కాపూర్ గ్రామానికి చెందిన యూత్ సభ్యులకు వాలీబాల్ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. హెడ్ కానిస్టేబుల్ రవీందర్‌రెడ్డి, గ్రామస్తులు కోవ భగవాన్, యూత్ సభ్యులు ఉన్నారు.